ప్రతి గడపకూ సంక్షేమం

● గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం చేసిన నాటి నుంచి నేటి వరకూ ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని సమతానగర్‌లో పర్యటించారు. వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వెళ్లి మరీ అందజేస్తున్నామన్నారు. గత నాలుగేళ్లలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చామన్నారు. స్థానికంగా ఉండే సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, సిరట్ల వాసు, ఆళ్ల గణేష్, జీలకర్ర నాగేంద్ర, బి.సత్యనారాయణ, ఎస్.లక్ష్మణరావు, వైవీ రమణ, కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోగాదికి అభినందనలు



జీవీఎంసీ 69వ వార్డుకు చెందిన ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావుకు జిల్లా సివిల్ సప్లై అధికారులు అభినందనలు తెలిపారు. శుక్రవారం నాతయ్యపాలెంలో ఆయన నివాసంలో జిల్లా సివిల్ సప్లై అధికారి ఐ.రాజేశ్వరి బోగాదికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

- అక్కిరెడ్డిపాలెం

25న అప్రెంటిస్, ఉద్యోగాలకు ఎంపికలు

పెదగంట్యాడ: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అన్ని ట్రేడుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 25న అప్రెంటిస్, ఉద్యోగాల భర్తీ ఎంపికలు నిర్వహించనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ లండ సుధాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాన్సన్ లిఫ్ట్స్ లిమిటెడ్ కంపెనీ కోసం ఈ ఎంపికలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు జతల బయోడేటాతో పాటు ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 25 ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ ఐటీఐ (న్యూ) స్టీల్‌సిటీలో హాజరు కావాలని కోరారు.

ఎస్సీ కాలనీ సమస్యలపై వినతి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని ఎస్సీ కాలనీ సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు కోరారు. ఈ మేరకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీల్లో సామాజిక భవనాలు నిర్మించాలని, పెదగంట్యాడ జంక్షన్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాలు పెట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ యువతీ, యువకులకు రుణాలు మంజూరు చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో మార్పుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, బలిరెడ్డి పెంటయ్య, రాజారావు, వెంకటేష్, పెంటారావు, నూకరాజు ఉన్నారు.

ఉత్సాహంగా పాటల పోటీలు



పోటీలో పాట పాడుతున్న చిన్నారి

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు శుక్రవారం పాటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు.

అగనంపూడి కళాశాలను సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ

అగనంపూడి: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నాడు నేడు కార్యక్రమంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆర్వో ప్లాంట్, ఆవరణలోని సేఫ్టీ గ్రిల్స్ తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమయంలో మేఘావృతం కావడం, గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చీకట్లో కొద్దిసేపు వసతులు పరిశీలించి అనకాపల్లి జిల్లాలో వసతి గృహాల పరిశీలనకు వెళ్లిపోయారు. ప్రిన్సిపాల్ కార్యదర్శితో పాటు విశాఖ, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారులు చంద్రకళ, వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

827వ రోజుకు ఉక్కు నిరాహార దీక్షలు



827వ రోజు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: దేశంలోని రైతుసంఘాలు, ప్రజా సంఘాలు, యువజన సంఘాలను కలుపుకొని ప్రతి జిల్లాలోనూ సమావేశాలు నిర్వహించి తద్వారా ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 827వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 22, 23, 24 తేదీల్లో ఉక్కు కర్మాగారంలోని ప్రతి విభాగంలో పోరాట కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, తద్వారా దీక్ష శిబిరంలో కార్మికులు సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని, ఉక్కు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కోక్ ఓవెన్ విభాగ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'ఉక్కు' పోరాటంలో భాగస్వామ్యం కావాలి



ప్లకార్డులతో బొత్స ఝాన్సీలక్ష్మి, హేమంత్‌కుమార్

బీచ్ రోడ్డు: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో భాగస్వామ్యం కావాలని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మిని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ కోరారు. ఈ మేరకు సిరిపురంలోని ఆమె నివాసంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యతిరేక పోరాటానికి మద్దతు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు.

హౌసింగ్ బోర్డు కాలనీ బస్సు సర్వీసు పునరుద్ధరించాలి



ఆర్టీసీ గాజువాక మేనేజర్‌కు పరిస్థితిని వివరిస్తున్న దొడ్డి రమణ తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ బస్ సర్వీసును పునరుద్ధరించాలని వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ కోరారు. బస్సు సౌకర్యం లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఆర్టీసీ గాజువాక మేనేజర్ ఏసుపాదంను పరిశీలించాలని సూచించారు. దీంతో ఆయన హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా దొడ్డి రమణ మాట్లాడుతూ కాలనీ లాస్ట్ బస్టాప్ వరకూ సర్వీసులను తిప్పాలని విన్నవించారు. స్పందించిన ఆర్టీసీ మేనేజర్ ఉన్నతాధికారులతో చర్చించి వెంటనే బస్సు సర్వీసును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు టీవై దాస్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి దుర్గారావు, సురేష్, భాస్కరరావు, దేవి, భూలక్ష్మి, లత, రేవతి, బాలాజీ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి సహాయం అందజేస్తున్న నాయకులు

గాజువాక : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న గాజువాక వాసి బలివాడ విజయకుమారికి గాజువాక శిష్టకరణ సంఘం సభ్యులు గురు వారం ఆర్థిక సాయం అందజేశారు. సంఘం సభ్యుల ద్వారా సేకరించిన రూ.29 వేల నగదును సంఘం నాయకుల చేతుల మీదుగా బాధితురాలికి అందజేసినట్టు సంఘం అధ్యక్షుడు బలివాడ సత్యారావు తెలిపారు. ఆమెకు గతంలో కూడా రూ. 20 వేల ఆర్థిక సాయం అందించామని, తమ శక్తిమేర ఆమెకు అండగా ఉంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాసంగి తిరుపతిరావు, కరకవలస గౌరీ ప్రసాదరావు, నాగుమంత్రి వెంకటేశ్వరరావు, లకనాపురం రమణమూర్తి, డబ్బీరు హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి చంద్రబాబు మోకాలడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న మస్తానప్ప

ఉక్కునగరం: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అడ్డుకుంటున్నారని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప ఆరోపించారు. శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన దగ్గర నుంచి చంద్రబాబు నాయుడు కొన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, ఇళ్లు, సంక్షేమం అందకుండా అడ్డుపడటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రకు విశాఖ రాజధాని, భోగాపురం విమానాశ్రయం, డేటా సెంటర్ రావడం ద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తాయని భావిస్తుంటే తన కుల పత్రికలతో తప్పుడు రాతలు రాయిస్తూ విషం చిమ్ముతున్నారన్నారు. ప్రజలు ఇవన్నీ గమనించి తగిన సమయంలో చంద్రబాబుకు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మార్పుపూడి పరదేశి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, పిట్టా రెడ్డి, జి. అప్పలరెడ్డి, బొడ్డ గోవింద, డి. పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి జీవితం బడుగు వర్గాలకే అంకితం

అక్కిరెడ్డిపాలెం: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం పేద, బడుగు, బలహీనవర్గాలకే అంకితం చేశారని భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జీ.టి.పి.ప్రకాష్ అన్నారు. శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని సంస్థలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సుందరయ్య పార్లమెంటుకు సైకిల్‌పై వచ్చేవారన్నారు. ఆయన యావదాస్తిని పేదలకు అంకితం చేసిన గొప్ప కమ్యూనిస్ట్ నాయకుడు అన్నారు. పార్టీలకు అతీతంగా అందరు ఆయనను గౌరవించేవారన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు ఎస్.జగన్నాథరావు, జి.రాంబాబు, బి.కృష్ణమూర్తి, పి.శివరాం, ఆర్. జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

డాబాగార్డెన్స్: స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నెంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్-2 నుంచి రెండు, జోన్-3, 4, 5 నుంచి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మనిషి సుందరయ్య

మల్కాపురం : కమ్యూనిస్ట్ ఉద్యమ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమం పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో సీపీఎం నాయకులు శుక్రవారం నిర్వహించారు. మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉరుకూటి బాబూరావుయాదవ్, పెంటారావు, ఐద్వా నాయకులు విమల తదితరులు పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీకి, నిరుపేదల సేవల్లో తరించిన ప్రజల మనిషిని, ఆయన అందించిన సేవలను కొనియాడారు. 58వ వార్డు గుల్లలపాలెం, 59వ వార్డు నెహ్రూనగర్ ప్రాంతాల్లో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలను ఆ పార్టీ నాయకులు నిర్వహించారు.

చంద్రబాబువి మతి తప్పిన మాటలు



సమావేశంలో మాట్లాడుతున్న చినతల్లి

గాజువాక : ఉత్తరాంధ్ర పర్యటనలో చంద్రబాబు మతి తప్పి మాట్లాడుతున్నారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి విమర్శించారు. 67వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు 435 చదరపు అడుగుల చొప్పున ఇళ్లు ఇచ్చారన్నారు. ఆ ఇల్లు శవాన్ని పాతిపెట్టడానికి కూడా సరిపోదంటూ చంద్రబాబు మాట్లాడడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఆయన నిజాలు మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లా పెంటారావు, కామునాయుడు, అన్నపూర్ణ, లక్ష్మి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ దుకాణాల తొలగింపు

మల్కాపురం : ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లపై అనధికారికంగా నిర్వహిస్తున్న దుకాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. జింక్ గేటు నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు ఫుట్‌పాత్, సర్వీస్ రోడ్లపై చిరు వ్యాపారులు ఫ్రూట్స్, టిఫిన్ సెంటర్, నూడిల్స్ స్టాళ్లు, తందూరీ పాయింట్స్, రడీమేడ్ వస్త్రాల దుకాణాలు ఏర్పాటు చేసి దర్జాగా తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వచ్చే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానికులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అధికారులు శుక్రవారం ఫుట్‌పాత్, సర్వీస్ రోడ్లపై ఉన్న అనధికారిక దుకాణాలను తొలగించారు. నాయకుల సిఫార్సు లున్న వారి షాపుల జోలికి పోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చిన్నారులకు నాట్యంలో శిక్షణ



నాట్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మల్కాపురం : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు చిన్నారులకు నాట్యంలో శిక్షణతోపాటు, నీతి కథల్ని బోధించారు. శిబిరంలో శుక్రవారం ఎస్ఎస్ఎస్ వలంటీర్లు అలేఖ్య, లావణ్యలు పాల్గొని చిన్నారులకు నాట్యం నేర్పారు. వివిధ గేయాల ఆలాపనలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం కార్మిక నాయకుడు బి.సత్యానందం, జిల్లా ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మిలు నీతి కథలను చిన్నారులకు బోధించారు. కథల ద్వారా వారేం తెలుసుకున్నారో అడిగారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతి



యూసీడీ పీడీ పాపునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడుకు డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం గాజువాకలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.జోసెఫ్ కిషోర్, విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు డీఏ సూర్య మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఉద్యోగులకు ఇన్‌చార్జి విధుల్లో వెసులు బాటు కల్పించాలని కోరామన్నారు. మెప్మా యాక్టివిటీలో వెల్ఫేర్ సెక్రటరీలను అనుబంధం చేసి జాబ్ చార్ట్‌లో ఇచ్చిన ప్రకారం బ్యాంకుల లింకేజీని వెల్ఫేర్ సెక్రటరీలకు అనుసంధానం చేయాల్సిందిగా కోరామన్నారు. వెల్ఫేర్ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ సెక్రటరీలకు బీఎల్‌వో డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరామన్నారు. వికలాంగుల కోటాలో పని చేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీలకు పెన్షన్ అమౌంట్ బ్యాంకు నుంచి తీసుకురావటానికి ఒకరిని సహాయకునిగా నియమించాలని, సచివాలయానికి సమీపంలో ఉన్న బ్యాంకుల నుంచి నగదును డ్రా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో సీడీవో సూర్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు వెంకట్రావు, జె.సమరం, బి.ఆనంద్‌భాను, కె.అశోక్ పెద్దినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ శాశ్వత, కాంట్రాక్టు ఉపాధిలో నిర్వాసితులకు ప్రాధాన్యత కల్పించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించకపోవడం అన్యాయమన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం శ్రామిక సంఘం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బలోపేతానికి ఐదు జోన్లుగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శిగా బొడ్డు పైడిరాజు, గౌరవాధ్యక్షునిగా కరణం సత్యారావు, అధ్యక్షునిగా ఎం. కోటేశ్వరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడి అప్పారావు, జాయింట్ జనరల్ సెక్రటరీగా కరణం బాలయోగితో పాటు 27 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మొల్లి ప్రకాశ్, సమ్మిడి రాజు, బొడ్డు రమణ, కరణం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత మొల్లివానిపాలెం జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సీతానగరంలో దుర్గమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను పురస్కరించుకుని ఎస్ఆర్‌వైఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మొల్లివానిపాలెం జట్టు విజేతగా నిలిచింది. సీతానగరం జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. విజేతలకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లా కార్తీక్, కురందాసు వంశీకృష్ణ, నక్క వెంకటరమణ, పల్లా చినతల్లి, మొల్లి చిన్న, మొల్లి నూకరాజు, నక్క గంగరాజు, మొల్లి రవి, పుర్రె పెంటారావు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణకు సత్కారం



పూర్ణను సత్కరిస్తున్న అతిథులు

అగనంపూడి: ఆపన్న ప్రదీపనా బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర కమిటీ సారథ్యంలో అగనంపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ)ను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య సారథ్యంలో నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారు జె.శ్రీకాంత్, సాయి సురేష్, జ్ఞాన ప్రసూనాంబ, సమాఖ్య రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాధవశర్మ, పురుషోత్తమ్, కోశాధికారి సుబ్బారావులను సమాఖ్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తుందని సత్కార గ్రహీతలు అన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

టెంట్ హౌస్ దగ్ధం



షాపు నుంచి ఎగసిపడుతున్న మంటలు

మల్కాపురం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని శ్రీనివాస్‌నగర్లో గురువారం అర్ధరాత్రి ఓ టెంట్ హౌస్ నుంచి మంటలు ఎగసి పడ్డాయి. షాప్‌ను ఆనుకుని పక్కనే ఉన్న ఓ ఇంటి హౌస్ వైరింగ్ దగ్ధమైంది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. మల్కాపురం పోలీసులు చెప్పిన వివరాలు. శ్రీనివాస్‌నగర్‌లో శ్రీను అనే వ్యక్తి సప్లయర్స్(టెంట్ హౌస్) దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి తన షాపును మూసేసి, ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో షాపు నుంచి మంటలు రావటం మొదలైంది. దాన్ని చూసిన స్థానికులు మంటల్ని ఆపే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో పెదగంట్యాడ అగ్నిమాపక అధికారులకు, మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శకటం మంటల్ని ఆర్పేసినా, అప్పటికే సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. అయితే ఈ ప్రమాదానికి కారణాలను అగ్నిమాపక అధికారులు చెప్పలేకపోతున్నారు. దీనిపై మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సర్వహిత పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సారథ్యంలో మే నెలకు సంబంధించి 75 మంది నిరుపేద వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందించారు. ట్రస్ట్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఒక్కొక్కరికీ రూ.200, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ప్రయాణ ఖర్చులు చెల్లించారు. అలాగే పక్షవాతంతో ఇంటికే పరిమితమైన పెదగంట్యాడ మండలం దల్లివానిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి కుటుంబానికి ఉక్కు అధికారి పోతురాజు వెంకటరావు సహకారంతో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, వ్యవస్థాపకుడు గుదే గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు జామి గణేష్, పొన్నగంటి కొండలరావు, శీరంశెట్టి గోవిందరావు, లక్కరాజు రాము తదితరులు పాల్గొన్నారు.